క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

వీరఘట్టం: ఈనెల 13న వీరఘట్టం బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను శతశాతం పంపిణీ చేయడం జరిగిందని తహసీల్దార్ చందక సత్యనారాయణ బుధవారం తెలిపారు. మొత్తం 1319 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. వీరిలో పురుషులు 908, మహిళలు 411 మంది ఉన్నారన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు బీఎల్ఓలు పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

150 మందికి కంటి పరీక్షలు

భామిని: మండలంలోని బత్తిలి ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో బుధవారం భారతీయ మానవ హక్కుల మండలి(బీహెచ్ఆర్‌సీ) సమన్వయంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ నిమ్మల భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రాణిపేట కంటి ఆస్పత్రి వైద్యుడు పి.ఎల్.ఎస్.రాజు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టింగ శాంతికుమారి, చర్చి ఫాదర్ సనాతన్ మలోబిశాయి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



తిరువీధి నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

సీతంపేట: సీతంపేటలో అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాష్‌రావు, ఉమ, సూర్యనారాయణ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని సోమగండి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సవర గోపాల్‌ను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. గోపాల్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలియడంతో బుధవారం అక్కన్నగూడలోని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్

గరుగుబిల్లి: రైతులు తమ వద్ద ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.సురేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉల్లిభద్రలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు, నియంత్రణ చర్యలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన నఖచిత్రం



గరుగుబిల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు తన చేతిగోళ్లతో(నఖచిత్రం) మదర్ థెరిసా, మహిళ స్వాగతం పలుకుతున్నట్లు గీచిన వర్ణచిత్రాలు ఆకట్టుకున్నాయి. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన పరిశినాయుడు చేతివేళ్లనే కుంచిగా మలిచి ఎన్నో చిత్రాలను వేశాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుని పలువురి మన్ననలు పొందుతున్నాడు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పాలకొండ: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తిరుమల కల్యాణ మండపంలో ఏపీ ప్రజా రవాణా సంస్థ మహిళా ఉద్యోగులు(ఎంప్లాయీస్ యూనియన్) నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అభివృద్ధి చెందితే తద్వారా ఆ కుటుంబం, సమాజం పురోభివృద్ధి చెందుతుందనే దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి వారి గౌరవాన్ని పెంచారన్నారు. అనంతరం ఉత్తమ మహిళా కండక్టర్లకు సన్మానం చేశారు. మహిళా కండక్టర్లు ఎమ్మెల్యే కళావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని 9 డిపోల నుంచి మహిళా కండక్టర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

గరుగుబిల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో మహిళా సంఘాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపీటీసీ డి.నారాయణమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు గంట లక్ష్మితోపాటు గ్రామైక్య సంఘాల అధ్యక్షులు స్వాతి, గౌరీలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ప్రతీ మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదిగి మరికొంతమంది మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు తిరుపతిరావు, ప్రసాద్, లక్ష్మణరావు, కృష్ణ తదితరులు ఉన్నారు.



పాలకొండ: మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి



సీతంపేట: బాలికల ఆశ్రమపాఠశాలలో మహిళా సిబ్బందికి సన్మానం

– సీతంపేట: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, కుక్‌లు, కమాటీలు, వాచ్ ఉమన్‌లను సన్మానించి, చీరలు పంపిణీ చేశారు. అలాగే పూతికవలసలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు అధ్యక్షతను బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా సౌధామిని ముఖ్యఅతిథిగా హాజరై 'నారీ శక్తి'పై ప్రసంగించారు. బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, అధ్యాపకులు బి.రాజు, జయమణి, పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: మహిళా కండక్టర్లతో ఎమ్మెల్యే కళావతి



పాలకొండ రూరల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్దననాయుడు



గరుగుబిల్లి: మహిళలను సన్మానిస్తున్న ఏపీఎం అప్పలనాయుడు

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



వీరఘట్టం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వరాయి కళావతి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావుకు మద్దతుగా బుధవారం వీరఘట్టంలో విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని చూసి ఈ నెల 13న జరిగే పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లత, పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాద్‌రావు, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమా, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను ఆశీర్వదించండి

పాలకొండ రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి కోరారు. పట్టణంలోని కస్పావీధి, కొత్తవీధి, కాపు వీధి శివారు ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. విద్యాధికులైన ఓటర్లు సీతంరాజుకు మద్దతు తెలపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మరియదాసు, గోపి తదితరులున్నారు.

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం, ఉల్లిభద్ర, దళాయివలస, బురదవెంకటాపురం, చినగుడబ తదితర గ్రామాల్లో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఎంపీపీ ఉరిటి రామారావు ప్రచారం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్‌లు బి.లక్ష్మి, జి.నారాయణమ్మ, ఎ.అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి మద్దతివ్వాలి

భామిని: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని లివిరి, పాందర కాలనీ, బైరికాలనీ, గొల్లకాలనీలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు డోల జగన్ బుధవారం ప్రచారం చేశారు. సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి, ఉత్తరాంధ్ర అభివృద్ధికి మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హిమరక మోహనరావు, మాజీ జెడ్పీటీసీ సోమరాజు గోపాలరావు, మాజీ సర్పంచ్ ఎస్.భవానీ, సర్పంచ్ బౌరి సౌధామిని, ఎంపీటీసీ పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: బురద వెంకటాపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రామారావు, తదితరులు



పాలకొండ రూరల్: కస్పావీధిలో ప్రచారం చేస్తున్న రాధాకుమారి, తదితరులు

జీడి సాగులో సస్యరక్షణపై అవగాహన

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో జీడి, మామిడి సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని డోలమడ రైతుభరోసా కేంద్రం పరిధి వంతవాడ కాలనీలో గిరిజన రైతులకు జీడి, మామిడి సాగులో సస్యరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ సహాయకులు అదీప్‌కుమార్ తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ అమరేశ్వరి

మామిడిలో సస్యరక్షణ

- చీడపీడలు, వాతావరణ మార్పులతో పిందె రాలే అవకాశం
- సరైన సస్యరక్షణ పాటిస్తే ఆశించిన దిగుబడులు



అమరేశ్వరీ
ఉద్యానవన అధికారి

పాలకొండ రూరల్: ప్రస్తుతం మామిడి పంట పూత దశను దాటి పిందె దశకు చేరుకుంది. ఈ దశలో పొగమంచు, చీడపీడలు, సూక్ష్మ, స్థూల పోషకాల లోపం కారణంగా పిందెలు రాలిపోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. సకాలంలో సస్యరక్షణ చేపట్టకపోతే పిందెలు పెరిగి కాయగా మారి ఆశించిన దిగుబడులు పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారి టి.అమరేశ్వరి సూచిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 18 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి.

నేలను బట్టి..

మామిడి తోటలు వేసిన రైతులు నేల రకాన్ని బట్టి పూత దశ నుంచి నీటితడులు అందించాలి. తేలికపాటి తడులు క్రమం తప్పకుండా అందించటం వలన పూత పిందె కడుతుంది. నేల స్వభావం బట్టి 20–25 రోజుల వ్యవధిలో నీరు అందించాలి. డ్రిప్ ద్వారా అయితే ఒక్కో మొక్కకు వంద లీటర్ల నీరు అందిస్తే సరిపోతుంది. తడులు ఎక్కువైతే చిగురు పెరిగి రసం పీల్చే పురుగులతో సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుత నెలలో వచ్చే పూత, పిందెను కాపాడేందుకు బోరాన్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కకు పిచికారీ చేయటం ద్వారా లబ్ధిపొందవచ్చు. అలాగే అగ్రోమిన్ మ్యాక్స్ లేదా ఫార్ములా–4 వంటివి 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయటం వలన పిందె నిలుపుకునే అవకాశాలు మెరుగుపడుతుంది. పిందె బఠాని గింజ పరిమాణం నుంచి వివిధ సైజుల్లో ఉన్నంతవరకు తేలికపాటి నీటితడులు కొనసాగించాలి. తోట పూర్తిగా ఎండిన తరువాత నీటితడులు అందించట వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు.

పోషక లోపాలు అధిగమించేందుకు..

పిందె దశలో మొక్కలో పోషక లోపాలు అధిగమించేందుకు నీటితడులు అందించే సమయంలో మొక్క వయసుకు అనుగుణంగా(10 ఏళ్ల చెట్టుకు) ఒక్కోదానికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి. దీని వలన మొక్కకు బలం చేకూరుతుంది. అలాగే సూక్ష్మ పోషకాలు కూడా అవసరం. మొక్క చుట్టూ మీటరు దూరంలో ట్రెంచ్ తవ్వి అందులో వీటిని వేయాలి. ముఖ్యంగా అధికారుల సూచనలతో జింక్ సల్ఫేట్, ఐరన్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్, బోరాక్స్ వంటివి పావుకిలో లోపు అందించాల్సి ఉంటుంది. కాయ అభివృద్ధి దశలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి అందించ వచ్చు.

హార్మోన్ల సమతుల్యత కాపాడేందుకు..

సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ పిందె రాలుడు సంభవిస్తే హార్మోన్ల సమతుల్యత లోపంగా భావించాలి. దీనిని అధిగమించేందుకు 4.5 లీటరు నీటికి 1 మిల్లీ లీటరు వంతున ప్లానోఫిక్స్ కలుపుకుని పిచికారి చేయాలి. మొక్కకు హార్మోన్లు అందించే సమయంలో ఇతర క్రిమిసంహార మందులతో కలపకుండా ప్రత్యేకంగా అందించాలి. పిందె పెరుగుతున్న సమయాల్లో అధికారుల సూచనలతో ఈ మందులు అందించాలి. అలాగే చీడపీడలు నివారణపై కూడా దృష్టి పెట్టాలి.



మామిడి పిందెలు



మామిడి పూత

రెవెన్యూ సర్వీస్ సంఘం సమావేశం

పాలకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం డివిజన్ రెవెన్యూ సర్వీస్ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు సావిత్రి, గౌరవ అధ్యక్షులు లిల్లీపుష్పనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పి.సన్యాసిరావు, కోశాధికారిగా గుమ్మలక్ష్మీపురం డీటీ రాజేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ సహాధ్యక్షుడు బి.బుచ్చయ్య మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఆశాజనకంగా నువ్వుసాగు

జియ్యమ్మవలస: మండలంలోని చాలా గ్రామాల్లో నువ్వుసాగు చేస్తున్నారు. రబీలో వరిసాగు తగ్గించాలని అధికారులు సూచించడంతో నువ్వుసాగుపై రైతులు మొగ్గుచూపారు. ప్రస్తుతం పంట కూడా ఆశాజనకంగా ఉంది. తేలికపాటి వర్షం కురిస్తే పంట బాగా పండి దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బొమ్మిక వద్ద సాగులో ఉన్న నువ్వుపంట

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

గరుగుబిల్లి: ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అజూ రఫీజాన్, ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో 723 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఇప్పటికే వీఆర్ఓల ద్వారా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉదయ 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు ఎన్నికల కమిషన్ అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని వెంటతీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.కృష్ణ, హెచ్‌ఎం పాత్రుడు, వీఆర్ఓ శంకర పట్నాయక్ తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రఫీజాన్, తదితరులు

లివిరిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్మోహనరావు బుధవారం దర్శించుకున్నారు. హోలీ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త, పర్లాకిమిడి మహారాణి కల్యాణి గజపతిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తమ తాతలు షియాళీ దొరలుగా, పర్లాకిమిడి మహారాజుల మోఖాసాదారులుగా, విశ్వాసపాత్రులు కావడంతోనే తమ ఇంటిపేరు విశ్వాసరాయిగా వచ్చిందని గుర్తు చేశారు.



మహారాణి కల్యాణి గజపతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

రంగుల పండగ

రంగుల పండగ హోలీని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగుల్లో తడిసిముద్దయ్యారు. సంతోషాల కేరింతలతో సంబరాలు మిన్నంటాయి.

– గుమ్మలక్ష్మీపురం



గుమ్మలక్ష్మీపురంలో హోలీ సంబరాల్లో చిన్నారులు

రూ.10.35 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తుల సేకరణ

- జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర

పార్వతీపురంటౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. స్థానిక జీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ద్వారా చింతపండు కొనుగోలు ముమ్మరం చేశామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రూ.4.30 కోట్లు కొనుగోలు లక్ష్యాన్ని నిర్దేశించగా.. రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామన్నారు. గ్రేడ్–1 రకం చింతపండు రూ.32.40కు, పిక్క తీసిన చింతపండును రూ.65లకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన అన్ని రకాల అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా జీసీసీ పరిధిలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు నాణ్యమైన చింతపండు, జీడిపిక్కలు, ఇండుగ పిక్కలు, కరక్కాయ, కొండ తామర జిగురు, కొండచీపురు, తేనెలను తీసుకుని వచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అటవీ ఉత్పత్తుల సేకరణ, నిధుల చెల్లింపులో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.